


ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ

# సామాంపాతు సరస్వతీ!

**- ఎనుగంటి వేణుగోపాల్**

'సరస్వతీ నమ స్తుభ్యం వరదే కామరూ పిణీ...'

-విద్యార్థులంతా ముక్త కంఠంతో ఆలపిస్తుంటే... పాఠశాల ప్రాంగణంలో లయబద్ధంగా ప్రతిధ్వని స్తోంది శ్లోకం.

అది చెవిని సోకుతుంటే ఐస్‌ఫ్రూట్ చప్పరిస్తున్నంత కమ్మగా ఉంది రాముకి. స్కూల్లోని జారుడుబండనెక్కి జారుతు న్నంత సంబరంగానూ ఉంది.

తలమీదున్న ఇసుక తట్ట బరువుగా ఉన్నా నిగ్రహించుకుంటూ క్షణకాలం 'శ్లోకముగ్ధుడై' గేటుదగ్గరే నిలబడిపోయాడు.

'సామాంపాతు సరస్వతీ నిశ్శేష జాడ్యాపహా!'

శ్లోకం పూర్తయిపోయింది. అయినా రాముకి అడుగు ముందుకు పడలేదు.

అరుదుగా ఆకాశంలో విరిసే హరివిల్లన్నా, నిత్యం ఎద గదిలో నినదించే సరస్వతీ స్తోత్రమన్నా వాడికెంతో ఇష్టం.

శ్లోకాల మాధుర్యమహిమో లేక అనునిత్యం వింటుండడంవల్లనో గానీ ఆ శ్లోకాలు కంఠతా వచ్చు వాడికి.

"ఒరేయ్ రామూ! సరస్వతీ స్తోత్రం చెప్పరా" అని ఎవరైనా అడిగితే గుక్కతిప్పుకోకుండా ఉత్సాహంగా ఇట్టే చెప్పగలడు.

కానీ ఎవరూ అడగరు. పని సరిగ్గాచేయడం లేదంటూ మేస్త్రీ కేకలేయడం తప్ప. అదే దిగులు వాడికి.

రాముకి తెలుగు అక్షర పరిజ్ఞానముంది. సమయం చిక్కినప్పుడల్లా ఇసుక కుప్పలపై వేలుని కలంలా మల చుకొని తప్పో ఒప్పో శ్లోకాల్ని రాసే ప్రయత్నం చేస్తుం టాడు.

'బాల్యాన్ని రక్షిద్దాం! బడిలో చేర్పిద్దాం!'అనే ప్రభుత్వ నినాదపు ఛాయలేవీ దరిచేరని బాల కార్మికుడు వాడు. స్కూల్ ప్రక్కన కన్‌స్ట్రక్షన్ జరుగుతున్న బిల్డింగ్‌కి వర్క్ చేస్తున్నాడు.

శ్రావ్యంగా విన్పించే శ్లోకాలు, తదితర ప్రార్థనా గీతాలు తప్ప ఆ స్కూల్లో ఏం జరుగుతుందో రాముకి కన్పించదు. ఆ సమయానికి స్కూల్ గేట్లు మూయబడి ఉంటాయి.

ప్రార్థన ముగిసి విద్యార్థులంతా బిలబిలమంటూ తరగతి గదుల్లోకి వెళుతుంటే... తలమీద తట్టతో తను మాత్రం శూన్య మనస్కుడై ముందుకి నడిచాడు.

సడెన్‌గా అప్పుడు విన్పించిందొక శబ్దం, తలమీద తట్ట కదలకుండ కనురెప్పల్ని లేవనెత్తి దూరంగా ఆకాశం వంక చూశాడు ఉరుమేమోనని, అదేం కాదు వాతావరణంలో అసలా ఛాయలేవీ లేవు.

వర్క్ జరుగుతున్న బిల్డింగ్ దగ్గరనుండి సన్నగా ఏదో కలకలం...

అప్పుడు తట్టిందా చిన్నిబుర్రకి ఏదో జరిగిందను కుంటూ తల మీదున్న ఇసుక తట్టని గభాల్న కింద పడేసి తుపానులా ఆవైపుకి ఉరికాడు.

ఒకవైపు బిల్డింగ్ మూడో అంతస్తుకి ఎలివేషన్ వర్క్ జరుగుతోంది. మరొకవైపు లోపలి గదుల్లో సిమెంట్ పూతలు, అలా వర్కర్స్ రెండు జట్లుగా విడిపోయి పని కొనసాగిస్తున్నారు.

నిలువెత్తు వాసాలకి బిగించిన పరంచాల మీద నిలబడిన నలుగురు ఎలివేషన్ పనిలో నిమగ్నమైపోయారు.

పరంచాలకి, వాసాలకి కట్టిన తాళ్లే వదులయ్యాయో-తెగాయో లేక వాసాల కర్రలే ఫెళ్లున విరిగాయో గానీ... ఊహించని ప్రమాదం జరిగిపోయింది.

పరంచాల పైనున్న పనివాళ్లు వేస్తున్న కేకలకి లోపలి గదుల్లో పనిచేసుకుంటున్న మిగతా వర్కర్స్ భీతిల్లి బయటకు పరుగెత్తుకు వచ్చారు.

రాము ప్రమాద స్థలికి చేరుకునేసరికి-

"చిన్నా!"అని అరుస్తున్నారెవరో.

కంకర రాళ్ల కుప్పమీద కూర్చొని రాళ్లతో ఆడుకుంటున్న మూడేళ్ల పిల్ల వాడి మీద పడింది రాము దృష్టి. సరిగ్గా వాటికిందే తానున్నా కుప్పకూలుతున్న వాసాలు, పరంచాలని గమనించే స్థితిలో లేడాపిల్లవాడు.

'దేహధూళితో, కచ భారంతో
నోశుల వ్రేళుల, పాల బుగ్గలూ
ఎక్కడ చూస్తే అక్కడ మీరై
విశ్వరూపమున విహరిస్తుండే
పరమాత్మలు ఓ చిరుతల్లారా!'

- అన్న శ్రీశ్రీ శైశవ గీతి చందాన సర్వం మరచి తన లోకంతానై ఆటలాడుకుంటున్నాడా కుర్రాడు.

ఆ దృశ్యం కంట పడ్డాక ఆ చిన్న బుర్రకేం తట్టిందోమరి?

బటన్ నొక్కిన మరుక్షణం చకచకా పని చేసుకుపోయే కంకర మిషన్‌లా ముందుకు దుమికాడు రాము.

"ఒరి పొలగా. ఏం పోయేకాలమొచ్చిందిరా నీకు. అటురుకుతున్నవ్!" వెనక నుండెవరో తనను ఉద్దేశించి బిగ్గరగా అరుస్తున్నా రాము పట్టించుకోలేదు. అటు తిరిగి చూడనూ లేదు.

ఆ బిల్డింగ్ ఓనర్ సైతం ఎవరో తరుముతున్నట్లు తన వెనకాలే పరుగెత్తుకు వస్తున్నా తాము గమనించే స్థితిలో లేడు.

చుట్టుపక్కల నుండి జనం కూడా పోగయ్యారు.

కనురెప్ప మూసి తెరిచేంతలో-

ఇసుక, కంకర, సిమెంట్‌లని తనలో కలుపుకొని వాటిని మిక్స్‌చేసే యంత్రంలా చిన్న పిల్లవాడిని తనవైపు లాగాడు రాము. లేకపోతే అంతెత్తునుండి నేల కూలతోన్న వాసాలు, పరంచాలు, తదితర వస్తువుల కింద పడి నలిగిపోయేవాడే!

వెంట్రుకవాసిలో ప్రమాదం తప్పిపోయినా మరొక ఘోరం జరిగిపోయింది.

రాముని కూడా వదల్లేదు. కనురెప్ప మూసి తెరిచేంతలో సీను తారుమారయ్యింది.

రాముతోపాటు బలమైన గాయాలైన మిగతా వర్కర్స్‌ని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.

ప్రమాద సమయంలో-

'అమ్మమ్మా!' అంటూ హృదయ విదారకంగా రాము చేసిన ఆక్రందన అక్కడి వాళ్లందరి హృదయాల్ని కలచివేసింది.

* * *

"ఇదిగో ఈ కుర్రాడే... మన చిన్నాని ఆక్సిడెంట్ నుండి కాపాడింది." చెయ్యెత్తి రాముని చూపిస్తూ భార్యతో అన్నాడు శ్రీకర్.

బెడ్ మీద రాము నిస్తేజంగా పడుకొని ఉన్నాడు. గ్లూకోజ్ ఎక్కుతోంది. శరీరంపై అక్కడక్కడా బ్యాండేజెస్...

"రామూ!" పిలిచాడు శ్రీకర్.

అనస్థీషియా దిగుతున్నట్టుంది. మత్తు వీడి సుతిమెత్తగా కన్రెప్పలు తెరిచాడు.

ఎదురుగా బిల్డింగ్ యజమాని శ్రీకర్.

"బాబు... మంచిగున్నడా అయ్యా!" ఆక్సిడెంట్ అనంతరం రాము మాటాడిన తొలి మాటది. ముద్దముద్దగా ఉన్నాయి మాటలు.

ఆ మాటకి ప్రక్కనున్న శ్రీకర్ భార్య సరస్వతికి బాధ కల్గింది.

చిన్నవాడయ్యాడు గానీ తన బిడ్డని రక్షించినందుకు చేతులెత్తి మొక్కేదే!

"బానే ఉన్నాడు. నీకెలా ఉంది?" ప్రశ్నించాడు శ్రీకర్.

"నొత్తుందయ్యా!" వాడి మాటకంటే కళ్లల్లోని దైన్యం కట్టిపడేసింది ఆ దంపతుల్ని.

"తగ్గిపోతుంది." ఊరడిస్తూ అటూఇటూ పరికించి చూసింది సరస్వతి.

"ఏరా! మీ అమ్మా...నాన్నా... ఎవరూ కన్పించట్లేదు. మీ వాళ్లెవరికి ఈ విషయం తెలియదా?" అనడిగింది మళ్లీ.

వాడి కనుపాపల ఉపరితలాల మీద సన్నగా కన్నీటి తెర.

సరస్వతి వేసిన ప్రశ్నకి రాముకి బదులుగా శ్రీకర్ బదులిచ్చాడు.

"వీళ్లది ఆంధ్ర. ఏడాదికింతని వీళ్ల యజమాని తీసుకువచ్చాడు- తెలంగాణకి. అందరికీ డబ్బుతోపాటు ఫుడ్ కూడా అరెంజ్ చేస్తాడు."

"అరె పాపం..." నొచ్చుకుంటూ "అయినా ఇదంతా మీవల్లే జరిగింది. చిన్నాని మీ చెంతే ఉంచేసుకుంటే సరిపోయేది. మనవాడి వలన "ఈ కుర్రాడికి అనవసరంగా ప్రమాదం జరిగింది." అంది సరస్వతి.

"జరిగిందేదో జరిగిపోయింది, తెచ్చిన ఫ్రూట్సయితే వాడికివ్వు." చెప్పాడు శ్రీకర్ భార్యవద్దన్నా కన్‌స్ట్రక్షన్ దగ్గరకు తీసుకెళ్లి బాబుని నిర్లక్ష్యంగా వదిలివేయడం తన పొరపాటేననుకుంటూ."

"చేతిలోని క్యారీబ్యాగ్‌ని వాడి పక్కన పెడుతూ" రామూ తీసుకో, ఇవన్నీ నీకే!" అంది వాడితో.

సరేనన్నట్టు తలూపాడు.

'వెళతామని' వాడితో చెప్పి, బలమైన గాయాలైన మిగతా ఇద్దరు వర్కర్స్‌ని పక్క బెడ్స్ దగ్గరకెళ్ళి పరామర్శించి వెనుదిరిగారు.

★ ★ ★

"పాపం ఆ పని కుర్రాడికేమైనా గిఫ్ట్‌లాంటిది ఇద్దామండీ!" రాత్రి భోజనాల దగ్గర భర్తని కదిపింది సరస్వతి.

తల పంకిస్తూ "ఏమిద్దాం? డ్రెస్ కుట్టిద్దామా! డబ్బిద్దామా!" భార్య ప్రపోజల్‌ని అంగీకరిస్తూ శ్రీకర్ అడిగాడు.

"మీ ఇష్టం-" నిర్ణయాన్ని భర్తకే వదిలేసింది.

"ప్రపోజల్ నీది. నువ్వు ఓకే అంటే నేనూ ఓకేనే!"

"క్యాషిస్తే ఖర్చయిపోతుంది. డ్రెస్ కుట్టిస్తే సముచితంగా ఉండదేమో? వాడు చేసిన పనికి కలకాలం గుర్తుండి పోతాడు మనకి. అలాగే మనం అందించే సహాయంవలన వాడి మనసులో మనం చిరస్థాయిగా నిల్చిపోవాలి" అంది సరస్వతి.

"వాడికి మనమేం సాయం చేస్తాం గానీ ఎంతోకొంత క్యాషిద్దాంలే." తన నిర్ణయం చెప్పాడు శ్రీకర్.

"దీనికింతగా తలలు బ్రద్దలు కొట్టుకోవడం దేనిగ్గానీ. ఒక పని చేద్దామండీ. వాడినే అడిగేద్దాం. వాడికేం కావాలో?" సూచించింది సరస్వతి.


అంగీకారంగా శ్రీకర్ తలూపాడు.

★ ★ ★

మరుసటి రోజు.

సరస్వతి బలవంతంమీద ఆమెతో హాస్పిటల్‌కి వెళ్లాడు శ్రీకర్. రాముని పలకరించి, నొప్పి గురించి తెల్సుకొన్నాక "నీకేమైనా కావాలా?" అనడిగింది సరస్వతి.

వద్దన్నట్టు తలూపాడు.



అయ్యా! నాకు సదూకోవాల నుంది... బడికి పోతనంటె సితకబాది మా అయ్య, అవ్వ మేత్రితోని ఈడికి పంపిన్రయ్య. నాకు సదూకోవాలనుందయ్యా!

సరిగా అర్థం చేసుకోలేదేమోనని "అంటే... తినడానికైనా, ఆడుకోవడానికైనా, మరేదైనా కావాలంటే అడుగు" అంది.

శ్రీకర్ మౌనంగా నిలబడ్డాడు. వాడేం మాట్లాడలేదు.

వాడినుండి జవాబు రాకపోవడంతో దగ్గరగావెళ్లి వంగి తల నిమురుతూ అంది "ఫర్లేదు చెప్పరా"అని.

"నీకేమైనా కోరిక ఉంటే చెప్పు రామూ!" ఈసారి శ్రీకర్ అడిగాడు. రాము ఏదో చెప్పబోయి ఆగిపోయాడు.

దూరాన ఉన్న అమ్మే గుర్తుకు వచ్చిందో... జరిగిన ప్రమాదం తాలూకు గాయమే మెలిపెట్టిందో... ఆ చిన్నారి కనుకొనలనుండి అశృకణాలు జాలువారాయి.

"అరరె! ఏడుస్తున్నావా? అయితే మేం వెళతాం" అంది.

చప్పున కన్రెప్పలు మూసి దుఃఖాన్ని దిగమింగుకున్నాడు.

"అయ్యా! నాకు సదూకోవాలనుంది..." సంశయిస్తూనే ఎలాగోలా గొంతు పెగిల్చాడు.

అది విని అవాక్కయ్యారిద్దరు! ఊహించని సమాధానమది. క్షణకాలం నిశ్శబ్దం.

"బడికి పోతనంటె సితకబాది మా అయ్య, అవ్వ మేత్రితోని ఈడికి పంపిన్లయ్య. నాకు సదూకోవాలనుందయ్యా!" చెబుతూనే ఆపుకోలేక పోయాడు. వాడి కళ్లు నీటి చెలిమలయ్యాయి.

"సర్సర్లే. అంతేకదా! చదువుకుందువులే. మేం చదివిస్తాం." మాటిచ్చింది సరస్వతి.

శ్రీకర్‌కి సరస్వతి మాటలు రుచించలేదు.

"వాడిని మనమెలా చదివిస్తాం. వాడు లేబర్‌గా వచ్చాడు. వాడి పేరెంట్స్‌తో మాట్లాడాలి. మేస్త్రీని ఒప్పించాలి. మొదటిది రిస్క్‌తో కూడుకొన్న పనైతే... రెండవది ఖర్చుతో ముడిపడింది. కుదిరే పనేనా సరూ!" లోగొంతుకతో అన్నాడు శ్రీకర్.

"పెళ్లైన పన్నెండేండ్లకి కల్గిన నలుసండీ చిన్నా. నా పంచప్రాణాల్ని ప్రాణాల్తో మనకిచ్చాడండి వీడు. ప్లీజ్ నామాట కాదనకండి." అభ్యర్థించింది సరస్వతి.

భర్త మౌనంగా ఉండిపోవడంతో "చిన్నా పుట్టక ముందు ఇక పిల్లలు పుట్టరేమోనని ఎవరైనా అనాథని చేరదీయాలని కూడా అనుకున్నాం. అలాంటిది ఒక అభాగ్యుడి కోరిక తీర్చడానికి వెనకాడతారేం? వీడికి చేసే విద్యాదానం... పాపం వాడి భవిష్యత్తునే మార్చివేస్తుందిగా..." కన్విన్స్ చేసే ప్రయత్నం చేసింది.

చివరికి శ్రీకర్ కరిగిపోయాడు.

"ఓకే... సరూ!" ఒప్పుకున్నాడు.

భర్తకి 'థాంక్స్' చెబుతూ "రామూ! నీ ఆరోగ్యం బాగయ్యాక చదువుకుందువు. మీ మేస్త్రీని అయ్యగారు కలుస్తారు. మీ అమ్మా, నాన్నల్తో ఫోన్‌లో మాట్లాడే వీలుందో లేదో కూడా తెల్సుకుంటారు. ముందు మందులైతే సరిగ్గా వేసుకో!" అంటూ రామూకి హామీ ఇచ్చింది సరస్వతి.

సాక్షాత్తూ సరస్వతీదేవి వరమిచ్చినట్లన్పించింది వాడికి.

చేతులెత్తి నమస్కరించాలనుకున్నా వీలులేని పరిస్థితి. గాయమై కుడి చేతికి కట్టు... ఎడం చేతికేమో యధావిధిగా నీడిల్. వాడి కళ్లల్లో కృతజ్ఞత... మొహంలో ఆనందం.. సరస్వతి చూపుల్ని దాటిపోలేదు.

"ఇక పడుకో" అని చెప్పి భర్తతో నిష్క్రమించిందక్కడినుండి.

ఇద్దరూ ఆ జనరల్ వార్డ్‌దాటి వెళుతుంటే రౌండ్స్‌కి వచ్చిన ఆర్థోపెడిక్ డాక్టర్ ఎదురయ్యాడు.

విష్ చేసి రాము హెల్త్ గురించి వాకబు చేసాడు శ్రీకర్.

"ఐయ్యామ్ సారీ! ఆ కుర్రాడు కుడి బొటన వేలు బాగా దెబ్బతింది. ఆక్సిడెంట్ మూలాన నుజ్జునుజ్జయ్యింది... బహుశా ఫ్యూచర్‌లో ఆ వేలు పన్చేయకపోవచ్చు. వాడికేవిధంగానూ ఉపయోగపడకపోవచ్చు" అంటూ ముందుకు కదిలాడు.

డాక్టర్ చెప్పింది విని షాకయ్యారిద్దరు.

"ఇదేంటండీ! మనమేం మంచికార్యం తలపెట్టినా ఇలా చుక్కెదురవుతోంది." హాస్పిటల్ నుండి బయటకు నడుస్తూ వాపోయింది సరస్వతి.

"ఇప్పుడేమయ్యిందని?" ప్రశ్నించాడు శ్రీకర్.

"ఏమయ్యిందంటారేంటండీ? బొటన వేలు పన్చెయ్యకపోతే వాడెలా రాస్తాడు. చదువెలా కొనసాగిస్తాడు?"

"పిచ్చి సరూ! కుడి చేయి కాకపోతే ఎడం చేయి. రెండుచేతులూ వీలుకాకపోతే కాళ్లున్నాయిగా? ఎంత మంది అలా విద్యావంతులవటం పేపర్లలో చూట్టం లేదు. చదువుకోవాలనే జిజ్ఞాస వాడికి ఉండాలే గానీ... ఈ లోపమొక లెక్కా?" అంటూ కారు స్టార్ట్ చేసాడు.

'ఎలాగైనా వాడికి అక్షర జ్ఞానం కలిగేలా చేయమని' ఆ సరస్వతీ దేవిని మనసులో ప్రార్థించింది సరస్వతి.

★